కథా నిలయం
6423
శ్రీకాకుళం

# ద్వివేదుల విశాలాక్షి కథలు

## దేవుడి పిలుపు

పడక తిన్నగా కుదరక అటు నుండి ఇటు ఒత్తిగిల్లాడు అప్పిగాడు. తలకింద పెట్టుకొన్న రాయి రోజూ కన్న మరీ గట్టిగా ఉన్నట్లు అనిపించింది. నడ్డి కింద కరకరమని నలుగుతున్న ఎర్ర కంకర పల్లేరుకాయల్లా గుచ్చుకో సాగింది.

నడి శీతాకాలం. చలి ఎముకల్ని కొరికేస్తూంది. పైగా రెండు రోజులై ఒకటే ఈదురుగాలి. చాలీ చాలని పైగుడ్డని ఎంతగా సాగదీసి కప్పుకొన్నా, ఒంట పట్టిన చలి అదుపులోకి రావడం లేదు. వెచ్చదనం కోసం కాళ్లని బాగా ముడుచుకొని, డొక్కలో దోపుకొని పడుకోవడంతో ఒళ్లంతా నొప్పులు పట్టుకొంది. చలికి నిద్ర తేలిపోయినా ఇంకా బద్ధకం మాత్రం వదలలేదు. ఒళ్లు విరుచుకొని, లేచి కూర్చుని జేబులోంచి బీడీ ముక్క తీసి అంటించాడు. ఎవరో పెట్టి పుట్టిన అదృష్టవంతుల ఇంటి ప్రహరీ గోడకి ఆనుకొని కూర్చుంటూ, ఆకాశంవైపు చూసి, "ఏ లెంతవుతాదో?" అనుకొన్నాడు.

ఆకాశం మేఘాల దుప్పటి కింద ముసలమ్మలా ముడచుకు పడుకొంది. కన్ను పొడుచుకు చూసినా ఒక్క చుక్క అయినా అగుపించలేదు. నిజానికి చుక్కల్ని చూసి వేళెంతయిందో చెప్పగల నేర్పు అప్పిగాడికి లేదు. అవ్వ దృష్టి బాగా ఉండే రోజుల్లో, రాత్రి ఏ వేళప్పుడు అడిగినా ఒక్కసారి ఆకాశం వంక చూసి టైమెంతయిందో టక్కున చెప్పేసేది. ఒక అరగంట అటూ ఇటూగా అది సరిపోయేది కూడా.

అవ్వ చూపు పోయి ఆర్నెల్లయింది. అవ్వ కాళ్లు పోయి అరవై ఏళ్లకి పైగా అయింది. కావలసిన వాళ్ళంతా ఆకలి రక్కసికి బలైపోయి చాలా కాలం అయింది. అయినా, అవ్వ ఇంకా బ్రతుకుతూనే ఉంది. ఏ రోజుకారోజే సరి అన్నట్లున్న ఆ ప్రాణం ఇంకా బొందిలో కొట్టుకొంటూనే ఉంది.

అవ్వ పేరు ముత్యాలు. "ముత్తవ్వా" అని పిలుస్తాడు అప్పిగాడు. అప్పిగాడికి ముత్తవ్వతో ఉన్న అనుబంధం రక్తసంబంధమైంది కాదు. కుల సంబంధమైంది కూడా కాదు. అది నూటికి నూరుపాళ్లూ ధన సంబంధమైంది. కాళ్ళు లేని ముత్యాలుకి మొగుడూ, కొడుకూ పోయాక మనిషి అవసరం పడింది. కడుపు మాడుతూ తిరుగులాడుతున్న అప్పిగాడికి తిండిపెట్టే మనిషి కావలసి వచ్చింది. అడవిలో ఉసిరికాయ, సముద్రపు ఉప్పూ కలిసి రుచికరమైన ఊరగాయగా మారినట్లు అవసరం వారిద్దరి మధ్యా అవ్వా మనుమల సంబంధాన్ని సృష్టించింది.

ముత్యాలుని ఉదయాన్నే అది కోరినచోటుకి చెక్కబండిమీద ఈడ్చుకుపోయి కూర్చోపెట్టడం, దాని టీ నీళ్లు, తిండి తిప్పలు వగైరాచూడ్డం, మళ్లీ చీకటి పడేవేళకి ముష్టివాళ్ల కాలనీగా పేరుగాంచిన ఆ పేవ్‌మెంటు మీదికి దాన్ని చేరవేయడం, ఇదీ అప్పిగాడు క్రమం తప్పకుండా రోజూ చెయ్యవలసిన పని. ఈ పనికి ప్రతిఫలంగా రోజూ తనకొచ్చే డబ్బుల్లో సగం వాటా వాడికిస్తుంది ముత్యాలు. ఆ డబ్బులతో అప్పిగాడికి తిండికి ఢోకా లేకుండా గడిచిపోయేది. అదే పండుగ రోజో, పర్వదినమో అయితే నోరు తడుపుకోవడానికి కూడా నాలుగు డబ్బులు మిగిలేవి.

వాడి సొమ్ము వాడికి వాటాగా పెట్టగా తన వంతు మిగిలిన సొమ్ముని నోట్లుగా మార్చుకొని, తన మొలలో ఉండే చిన్న గుడ్డ సంచిలో అతి భద్రంగా దాచుకొనేది ముత్యాలు. దేశంలో కరువు కాటకాలు పెరిగి, మనుషుల్లో ధర్మబుద్ధి కొరవడే పరిస్థితి ఏర్పడేవరకు ఈ ఏర్పాటు ఇద్దరికీ లాభసాటిగా ఉంటూ వచ్చింది. దేశంలో తిండి గింజల ధరలు కనీ వినీ ఎరుగనంతగా పెరిగిపోవడంతో సామాన్య సంసారుల చేతుల్లో దానధర్మాలకి పైసా మిగలక ముత్యాలు దినసరి రాబడి బాగా పడిపోయింది తన చేస్తున్న చాకిరీకి అది ఇస్తున్న సొమ్ము గిట్టుబాటుగా లేదని అప్పిగాడు విసుక్కొంటున్న సమయంలో, ముత్యాలు కళ్లు కూడా పోవడంతో అసలు కథ మొదలయింది.

వయసు ముసురుకొచ్చి రోగంతో బొత్తిగా పడకవేశాక ముత్యాలుకి కోపంతోపాటు కోరికలు కూడా రోజు రోజుకీ ఎక్కువ కాజొచ్చాయి. అది చెయ్యలేదనీ, ఇదిపెట్టలేదనీ రోజంతా అప్పిగాణ్ణి నోరు ముయ్యకుండా తిట్టిపోసేది. ముత్యాలు తనకి చూపకుండా రొంటిని దోపుకొనే ఆ చిన్న గుడ్డ సంచిలో చాలా సొమ్ము దాచి ఉంటుందనే నమ్మకమే లేకుంటే, దాని కర్మానికి దాన్ని వదిలి అప్పిగాడు ఎప్పుడో పలాయనం చిత్తగించి ఉండేవాడు. ఇంతకాలం చాకిరిచేసి, ఈనకాచి నక్కలపాలు చేసినట్లు, దానిని వదులుకు పోవడం బుద్ధితక్కువ అనే అభిప్రాయంతో, అది ఎన్ని తిట్టినా ఎదురు చెప్పకుండా పడి ఉంటున్నాడు.

ముత్తవ్వ ఆ విధంగా మొలలో దాచిన సొమ్ము అయిదో, పదో ఉంటే దానితో రెండు రోజులు మనసు తీరా ఇంత తాగి మజా చెయ్యవచ్చనీ, అలాకాక ఆ మొత్తం వందో ఏభయ్యో ఉంటే దానితో ఏదో చిన్న వ్యాపారం లాంటిది ప్రారంభించి ఈ ముష్టి బ్రతుక్కి ఇంతతో మంగళం పాడాలనీ అప్పిగాడి అభిప్రాయం. ఆ ఆశతోనే రోజు వెనక రోజుగా ముసిల్దాని చావు కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుకొస్తున్నాడు అప్పిగాడు.

ఒంట్లో రోగం, కడుపులో ఆకలి, బయట చలి. ముసలి ముత్యాలుకి రాత్రిపూట సరిగా నిద్రపట్టదు. ఇంకా మూడైనా కాకుండా లేచి కూర్చుంటుంది. "నెగరా అప్పిగా, తెల్లారిపోనాది" అంటూ.

పల్లెటూళ్లలో అయితే కోడికూతలు, పశువుల అలికిడి, పక్షుల అరుపులు రాత్రి తెల్లవారుతున్నట్లు తెలియజేస్తాయి. అదే పెద్ద పట్టణాలలో అయితే మిల్లు కూతలు, పాలబళ్ల

చప్పుళ్లు, పేపరు కుర్రాళ్ల కేకలు తెల్లవారుతూంది లెమ్మని పట్టణ వాసులకు మేలుకొలుపు పాడతాయి.

ఇంకా నాలుగు కాకుండానే గవర్నమెంటు పాల సప్లయి వాన్ ఒకటి రోడ్డు అదిరేలా రొద చేస్తూ రోజూ ఆ పక్క వీధిలోంచి వెళుతుంది. ఆ ధ్వని చుట్టుపక్కల ఇళ్ళలో కాపురాలుండే ఇల్లాళ్ళకు, ముఖ్యంగా ఉదయాన్నే భర్తను ఆఫీసుకి, పిల్లల్ని స్కూళ్ళకి అంపకం పెట్టవలసిన ఆడవాళ్ళకి ఒక అలారమ్ వంటిది. ఏరోజైనా అది కాస్త వేళ తప్పించి వస్తే అటువంటి గృహిణుల దినచర్య ఆనాడు అస్తవ్యస్తంగా తయారవుతుంది అన్నా అందులో ఆశ్చర్య పోవలసింది లేదు.

అంతవరకు మెల్లగా అప్పిగాడికి మేలుకొలుపు పాడే ముత్యాలు ఆ బండి చప్పుడు వినడంతోనే తన కంఠాన్ని, పాడే తీరుని కూడా హెచ్చించి, "నెగరా... నీ జిమ్మడ... నోరెండి సత్తన్నా.... కసిన్ని టీ నీల్లు తెచ్చి గొంతులో పొయ్" అంటూ తిట్లకి తగులుకొంటుంది.

ఇంకా పూర్తిగా బద్ధకం వదలని పేవ్‌మెంటు వాసులకు అవ్వ తిట్లతో నిద్రాభంగం కాగా, అందుకు కారకుడైన అప్పిగాడి మీద విరుచుకుపడతారు. "అది గడించెట్టి సన్నాల్లూ పందిలా పడి తిన్నావు. ఉప్పుడు అది నోరెండి కాసిన్ని టీ నీల్లు తెమ్మంటే నెగకుండా వల్లక తొంగున్నావు.... మడిసై పుట్టాక ఇస్వాస ముండా(లా" అంటూ నీతులు చెబుతారు.

మరి కొంతసేపు అవ్వ తిట్లు, ముష్టి సమాజపు పెద్దల హితబోధలు వింటూ గడిపేసి, ఇంక లేవక తప్పదన్నట్లు అప్పుడు లేస్తాడు అప్పిగాడు. అరమైలు దూరంలో ఉన్న రాజులు టీ కొట్టు దగ్గరికి అంచులు విరిగిపోయి, సొట్టలు పడ్డ ఒక అల్యూమినియమ్ గ్లాసు పట్టుకొని, మనసులో ముసిల్దాన్ని తిట్టుకొంటూ బయలుదేరతాడు. ముత్యాలు టీ కోసం ఇచ్చిన డబ్బులు ముందు రోజే బీడీలకి ఖర్చయిపోయి ఉంటాయి కాబట్టి రాజులు దయతలచి అరువు పోస్తే ఆ టీ నీళ్లు తెచ్చి అవ్వ గొంతుకలో పోసి బయటపడ్డం, లేకుంటే ఆ పోవడం అల్లాగే ఉడాయించి మళ్లీ జాము పొద్దెక్కాకనే అవ్వ దగ్గరికి రావడం.

అప్పిగాడు బీడీ ఆఖరి దమ్ము లాగి అవతల పారేయబోతూంటే, పక్క వీధిలోంచి పాల బండి రొద చేసుకుంటూ తరలిపోయింది. ముత్యాలు అంతవరకు నిద్ర లేవ కుండా పడుకోవడం అప్పిగాడికి ఆశ్చర్యం కలిగింది. 'ఈయేల ముసిల్దానికేటయింది? ఇంకా నెగనేదు' అనుకొన్నాడు.

వాడు అలా గోడకి చేరబడి మరో కునుకు తీసి లేచేసరికి కూడా ముత్యాలు ఇంకా అలాగే ముడుచుకొని పడుకొని ఉంది. చుట్టుపక్కల ముష్టివాళ్లంతా ఎవరి పనులమీద వాళ్లు వెళ్లిపోయారు. చలికి లుంగ చుట్టుకొని అలా పడుకున్న ముత్యాలుని చూస్తే ఎందువల్లో ఆరోజు అప్పిగాడి మనసులో జాలి పుట్టుకొచ్చింది. 'ఈ సలికి తట్టుకోనేక నానే సత్తన్నా, ముసిలిముండ ఎలా బరిత్తందో?' అనుకొన్నాడు. ఆ జాలి ఫలితంగా, అది లేచి అడక్కుండా

టీ పట్టుకు రావడానికి రాజులు కొట్టు వైపు బయలుదేరాడు. ఆరోజు అరువు పెట్టనని విసుక్కోకుండానే రాజులు టీ గ్లాసులో పోశాడు. "ముసిల్దానికెలా ఉందేటి?" అంటూ ముత్యాలు ఆరోగ్యం గురించి పరామర్శ కూడా చేశాడు. ముసలి ముత్యాలు చస్తే అప్పిగాడు ధనవంతుడవుతాడు అన్నమాట ముందు రోజు ఎల్లయ్య వల్ల వాడు విని ఉన్నాడు. ఆ పలకరింపులోని అంతరార్థం అదే!

అప్పిగాడు టీ పట్టుకు వచ్చేసరికి కూడా ముత్యాలు ఇంకా లేవలేదు. కదలక, మెదలక అలాగే పడి ఉంది. "ముత్తవ్వా! నెగేస్.... టీ సల్లారిపోతంది" అంటూ అది తల మీదుగా కప్పుకొన్న దుప్పటిని తొలగించాడు. అవ్వ నిద్రపోవడం లేదు. దాని కళ్లు పగిలిన పత్తికాయల్లా తెరుచుకొనే ఉన్నాయి. అవి అప్పిగాడి వంక రెప్ప వెయ్యకుండా చూస్తున్నాయి.

"ఒలే... ముత్తవ్వా.... సచ్చిపోనావుటే!" అన్నాడు అప్పిగాడు, దాని చెయ్యి పట్టుకొని కుదుపుతూ.

ఆ రాత్రి కురిసిన మంచంత చల్లగా ఉంది అవ్వ ఒళ్లు. పక్కగా పడిఉన్న కొయ్యా దుంగంత గట్టిగా ఉంది దాని చెయ్యి.

అవ్వ చావు కోసం నెల రోజులుగా గంటలు, నిమిషాలు లెక్క పెట్టుకొంటు న్నాడు అప్పిగాడు. వాడు ఎదురు చూసిన ఆ క్షణం వచ్చింది. కాని, ఏ కారణంగానో వాడికి కలగవలసినంత ఆనందం మాత్రం కలగలేదు. పైగా కళ్ళ వెంట రెండు నీటి బొట్లు అవ్వ శవంపై టప టప రాలాయి. "ముసిల్ది సెప్పా సెయ్యకుండా సచ్చూరుకుంది" అంటూ తనలో తనే దిగులుగా గొణుక్కున్నాడు.

అప్పిగాడి స్వగతం విని బద్ధకంగా కళ్లు నలుపుకొంటూ లేచి కూర్చున్నాడు ఎల్లయ్య. ఎల్లయ్య అప్పిగాడికి గురువు లాంటివాడు. ముష్టి విద్యలో గల సులువు బలువులు, మాయమర్మాలు అన్నీ వాడి దగ్గరే నేర్చుకొన్నాడు అప్పి గాడు. వయసుకి అప్పిగాడి కంటే ఏమంత పెద్ద కాకపోయినా, బుద్ధిలో ఎల్లయ్యదే పైచెయ్యి. ఆ ముష్టివాడలో ఎవరికి ఏ సమస్య ఎదురైనా "ఎల్లయ్యా" అంటూ సలహా కోసం వాడి దగ్గరికే వస్తారు అంతా.

"ఏట్రా అప్పిగా, ముసిల్ది కునికేసిందేటి?" అన్నాడు ఎల్లయ్య, కొద్దిగా ఆవులిస్తూ.

"వొప్పుడూ?" అన్నాడు దగ్గరికి వచ్చి దాని ముఖం చూస్తూ.

"నానూ ఉప్పుడే సూత్త" అన్నాడు అప్పిగాడు, పై గుడ్డతో కళ్లు తుడుచు కొంటూ. ముసిల్దాని చావు కోసం అంత కాలం కాటి దగ్గర నక్కలా కనిపెట్టు కొని కూర్చున్న అప్పిగాడు అలా కళ్లు తుడుచుకోవడం చూసి 'ఇంకా సిన్నోడు. అనుబవం సాలదు' అనుకొన్నాడు ఎల్లయ్య.

పట్నం మేలుకొన్నా, ఇంకా రోడ్డు మీద అంతగా జనసంచారం లేదు. తప్పనిసరిగా బయటికి వచ్చిన వాళ్లయినా ఎవరి తొందరలో వాళ్లున్నారు. పేవ్‌మెంటు మీద చచ్చిపడున్న

ముసిల్దాన్ని కానీ, డబ్బు కోసం దాని మొల తడుముతున్న ఇద్దరు మిత్రుల్ని కానీ ఎవరూ గమనించలేదు.

అట్టేసేపు వెతకనక్కరలేకుండానే అవ్వ భద్రంగా దాచుకొనే గుడ్డ సంచి దొరికింది. కాని, అందులో అప్పిగాడు ఆశించినట్లు వందా, ఏభయ్యా లేవు. అయిదూ, పదీ కూడా లేవు. అంతా కలిపితే రెండు రూపాయలలోపు చిల్లర డబ్బులు ఉన్నాయి. ముత్యాలు తన ఆర్జన ఆ సంచిలో కాక ఇంకెక్కడో దాచి ఉంటుందన్న అనుమానంతో శవాన్ని అటు ఇటు ఒత్తిగిల్లించి, కట్టుకొన్న బట్ట సడలించి చూశారు. తల కింద ఉన్న చింకి గుడ్డల మూట విప్పి చూశారు. కాని, ఫలితం లేకపోయింది. ఆ సంచిలో ఉన్న డబ్బులు మినహా దాని దగ్గర ఇంకో పైసా అయినా కనిపించలేదు.

ముత్తవ్వ దాచిన సొమ్ము అంతకన్న చాలా ఎక్కువగా ఉంటుందని అప్పిగాడి నమ్మకం. చూస్తే తను లాక్కొంటాడని ఆ సొమ్మును ఇంకెవరి దగ్గరో దాచిపెట్టి ఉంటుందని వాడి అనుమానం. “సీ... ముష్టి నంజ... సేకిరి నాసే సేయించుకొని సొమ్మింకెవరికో మింగపెట్టింది” అంటూ చచ్చిన దానిని చెడ తిట్టిపోశాడు.

ముత్యాలు దాచిన సొమ్ము అందకపోయినా, అంతకాలం దాని మనవడిగా దగ్గర మసలినందుకు దాన్ని కాల్చడం అన్న బాధ్యత వాడిపై పడింది. ఎల్లయ్య సలహా మీద ముత్యాలు ఏళ్ల తరబడి కూర్చుని ముష్టి అడుక్కొనే ఈశ్వరుడి గుడి ముందు దాని శవాన్ని పెట్టుకొని ఇద్దరూ కూర్చున్నారు.

“దర్మం చెయ్యండి బాబులు, దానం చెయ్యండి అమ్మలు. అనాది పేత దగనం, కోటి తీర్తాలు తిరిగొచ్చినంత పున్యం!”

ఎల్లయ్యకి ఆ పాట కంఠతా వచ్చు. ఒకటి, రెండు సార్లు కూలికి ఒప్పుకొన్నప్పుడు నేర్చుకొన్నాడు. అప్పిగాడు అనుభవం లేకపోయినా, సులువుగానే వరస అందు కొన్నాడు.

ఆరోజు ఏకాదశి, పర్వదినం. దేవుడి దర్శనానికి చాలా మంది మనుషులు వచ్చి పోతున్నారు. రోజూ అలవాటుగా వచ్చేవాళ్లే కాక, కొత్తవాళ్లు కూడా వస్తున్నారు. రోజూ వచ్చేవారిలో కొంతమందికి ముసలి ముత్యాలు ముఖం పరిచయమయిందే. ‘ఈ ముసిల్దానికి ఇంత కాలానికి దేవుడి పిలుపు వచ్చింది’ అనుకొంటూ శవం ముందు ఎవరికి తోచింది వాళ్లు పడేసి వెళ్లిపోసాగారు.

దేవుడి దర్శనానికి వచ్చేవారి మనసుల్లో మామూలు సమయాల్లో కన్న కాస్తంత ధర్మ చింతన, పాపభీతి సహజంగా ఉంటాయి. రోజూ ఇంటి ముందు కొచ్చే ముష్టివాడికి చెయ్యి విదపని వాళ్లు కూడా గుడి ముందు ముష్టివాళ్ల గుడ్డల్లో ఎంతో కొంత వేసి పోతారు. అందునా ముసిల్ది ఏకాదశి పర్వదినాన చచ్చిపోయింది. ఆ శవ దహనానికి సాయపడితే అందువల్ల లభించే పుణ్యం మామూలుగా వచ్చేకన్న అంతో ఇంతో అధికంగా ఉంటుందన్న నమ్మకం కొంత. జీవితంలో ప్రతి విషయానికీ డబ్బుతో వెలకట్టే మనుష్యులు,

పాప పుణ్యాల వ్యాపారంలో కూడా ఆ పాటి లెక్కా డొక్కా చూసుకొని ఖర్చు చెయ్యడం సహజమే కదా!

అలా అంతకాలం ఆ ముష్టి బ్రతుకు లాక్కొచ్చి ముత్యాలు ఏకాదశినాడు చచ్చిపోవడం ఒక విధంగా చెప్పాలంటే అప్పిగాడికి లాభించింది. పొద్దుపోయే వేళకి శవం ముందు కూడబడ్డ డబ్బులు లెక్కపెట్టుకొంటే వాళ్లు అనుకొన్న దానికన్నా రెట్టింపు ఉంది ఆ సొమ్ము. "మా మంచేలకి సచ్చిందిరా ముసిల్ది. ఇంకో ఏలైతే శవం ముంగల ఇంత సొమ్మడదు" అన్నాడు ఎల్లయ్య తృప్తిగా.

"అంతా ఆ భగవంతుడి దయ. నెగు.... నెగు.... బేగి దీన్ని తగలేసి మిగిలిన డబ్బెట్టి ఓ సుక్కేసుకొద్దాం" అన్నాడు అప్పిగాడు.

"ఓరొరె.... పొద్దుటేల తాగిన టీ నీల్లు. నా కడుపు కాలిపోతుంది. మొదల ఇంత కూడు తిని వప్పుడు తగలేద్దాం. తొందరేటి?" అన్నాడు ఎల్లయ్య.

ఎల్లయ్య ఆకలిమాట ఎత్తేసరికి అప్పిగాడి కడుపులో కూడా పాములు బుస కొట్టాయి. ఇద్దరూ సాయం పట్టి ముత్యాలు శవాన్ని మురికివాడకి పక్కగా ఉన్న ఒక చెట్టు కిందికి చేర్చారు. అక్కడ తెలిసిన ఓ ముష్టిదానికి శవాన్ని చూస్తూ ఉండమని అప్పచెప్పి ఊళ్లోకి బయలుదేరారు ఇద్దరూ.

కడుపులో ఆకలి శాంతించి, ఇంకా నాలుగు డబ్బులు జేబులో ఆడుతుంటే ఎల్లయ్య మనసులోకి ఒక పసందైన ఆలోచన పరుగుపెడుతూ వచ్చింది.

"ఓరొరే అప్పిగా! ఈ ముసిల్దాన్ని ఉప్పుడే తగలెయ్యకపోతే ముప్పేట్రా?" అన్నాడు బీడీ ముక్క అంటిస్తూ.

"సచ్చిందాన్ని తగలెయ్యకేటిసేసుకొంటాం! కూడెట్టనా? గుడ్డెట్టనా?" అన్నాడు అప్పిగాడు, భుక్తాయాసంతో పొట్ట రాసుకొంటూ.

"అదేరా సెప్పేది. కావాలంటే రేపటేలకి కూడెడతాది, సుక్క కూడా సూత్తది" అన్నాడు ఎల్లయ్య ఉత్సాహంగా.

ఎల్లయ్య ఆలోచన అప్పిగాడికి నచ్చింది. ఆరోజు లాగే మరునాడు కూడా ముసిల్దాని శవాన్ని ఇంకోచోట పెట్టుకొని, వచ్చిన సొమ్ము రాబట్టుకొని అప్పుడు కాల్చిపారేస్తే పోయేదేం లేదు. కాదంటే శవం కుళ్లి కాస్త కంపు కొడుతుంది.

ముత్తవ్వ దహనకాండ మరునాటికి వాయిదా పడ్డంతో అప్పిగాడి జేబులో మిగిలిన డబ్బులు మా సంగతి ఏమిటంటూ పలకరించాయి. వాటికి సమాధానం చెప్పేలోపునే కాస్త దూరంలో ఉన్న సుబ్బయ్య కల్లుపాక 'రండి రండం'టూ వాళ్లని ఆహ్వానించింది. కొత్త సరుకేదో వచ్చిందని చెప్పాడు సుబ్బయ్య. దాన్ని రుచి చూడకుండా ఊరుకోవడానికి వాళ్లకి మనసొప్ప లేదు. రాత్రి పొడుక్కీ ఇద్దరూ అలా పడి తాగుతూ అక్కడే ఉండిపోయారు.

తెల్లవారి కాస్త ఒంటిమీద తెలివి వచ్చాక ముసిల్దాని శవం గుర్తుకొచ్చింది. మెల్లగా లేచి కాళ్లీడ్చుకొంటూ శవాన్ని ఉంచిన చెట్టు దగ్గరికి వచ్చారు. చెట్టు కింద శవం లేదు. శవం మీద కప్పిన గుడ్డా లేదు. గుడ్డ గాలికి ఎగిరిపోకుండా ఎత్తు పెట్టిన రాళ్లు మాత్రం చెట్టు కింద ఒక పక్కగా పెట్టి ఉన్నాయి.

వాళ్లు శవానికి కాపలాగా ఉంచిన అంకాలమ్మ అక్కడ లేదు. తెల్లవారుతూనే అడుక్కోడానికి పట్నంలోకి వెళ్లిపోయింది. అప్పిగాడు, ఎల్లయ్య వస్తే కబురు చెప్పమని తనకి బదులుగా ఇంకో మనిషిని అక్కడ నిలిపి పోయింది. అంకాలమ్మ చెప్పమన్న నాలుగు మాటలు చెప్పి వాడు వెళ్లిపోయాడు. ఆ మాటల సారాంశం ఇది, పట్నంలో అక్కడక్కడ మశూచి వ్యాధి పొడచూపిందట. అది వ్యాపించకుండా అరికట్టడానికి ఆరోగ్యశాఖ వారు కార్యరంగంలోకి దూకారు. దానిలో భాగంగా మురికివాడల్ని శుభ్రం చెయ్యడానికి ఇంకా చీకటి ఉండగానే మునిసిపాలిటీ వారి చెత్త లారీలు ఊరు మీద విరుచుకుపడ్డాయి. అంకాలమ్మ ఎంత అడ్డుపెడుతున్నా వినకుండా కుళ్లి కందుపుకొడుతున్న ముసిల్దాని శవాన్ని బండిలో పడేసి పట్టుకుపోయారు. ఆ సమయంలో అప్పిగాడు కాని, ఎల్లయ్య కాని అక్కడ ఉండి ఉంటే, అలా శవాన్ని కుళ్లబెట్టి ఊర్లో అంటు వ్యాధులు ప్రబలడానికి కారకులైనందుకు వాళ్లని కూడా లాక్కుపోయి జైల్లో తోసేసి ఉండేవారు.

వాడు చెప్పిన కథంతా విని, "ఒలే ముత్తవ్వా! మాపిటికి కూడెట్టకుండా ఎల్లిపోనా వుటే" అని ఏడుస్తూ అప్పిగాడు చెట్టు కింద కూలబడ్డాడు. "ఏడవకేస్" అని అప్పిగాణ్ణి ఓదారుస్తూ తనూ ఆ పక్కనే వాలిపోయాడు ఎల్లయ్య.

రాత్రి పడ్డ మందు నిషా తెల్లవారినా ఇంకా వాళ్లని వదలలేదు. కొత్త సరుకు కావడం చేతేమో తల తిరుగుతున్నట్లు, కడుపులో కలిపేస్తున్నట్లు అదోలా తిక్కగా ఉంది. ఇద్దరూ పడిందే పాటుగా నిద్రలోకి జారిపోయారు.

పగటిపూట ఆ ప్రాంతంలో అంతగా జనసంచారం ఉండదు. రోజంతా ఊళ్లో అడుక్కొని, చీకటి పడబోతుంటే ఒకరొకరుగా ముష్టివాళ్లంతా అక్కడికి చేరుకొంటారు. కాస్త ముందుగా వచ్చిన వాళ్లయినా ఒంటి మీద స్పృహ లేకుండా చచ్చినట్లు పడున్న వీళ్లని గురించి పట్టించుకోలేదు. "దొంగెదవలు... సచ్చిందాన్ని ముందెట్టుకొని అడుక్కొన్న డబ్బుల్తో తెగతాగి పడున్నరు" అని కొందరు తిట్టిపోశారు.

ఉదయం ఎత్తుకెళ్లగా మిగిలిన చెత్త తీసుకు పోవడానికి సాయంకాలం మళ్లీ వచ్చింది ఛెత్తలారీ. ఈసారి పనివాళ్లతోపాటు పర్యవేక్షణకి సార్జెంటు కూడా వచ్చాడు. అతడు పరిసరాలన్నీ తిరిగి చూస్తుంటే చెట్టు కింద పడి ఉన్న అప్పిగాడు, ఎల్లయ్య కనిపించారు. అనుమానంగా కాస్త ముందుకి వంగి, చేత్తో ముట్టుకు చూశాడు. ఆ కట్టెల్లోంచి జీవం ఎప్పుడో లేచిపోయింది.

ఉదయం అవ్వ ప్రయాణం చేసిన లారీలోనే, దాని చావు కోసం రోజూ దేవుణ్ణి ప్రార్థించే అప్పిగాడు, ఎల్లయ్య సాయంకాలం బయలుదేరారు. బేధమల్లా ఒక్కటే. అవ్వది సహజ మరణం, వీళ్లది కొనితెచ్చుకొన్న చావు. చెత్తలారీ పట్నం దారి పట్టింది. పక్కగా ఉన్న పార్కులో రేడియో ప్రాంతీయ వార్తలు చెపుతూంది.... "ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం నగరంలో నిన్న రాత్రి విష మిశ్రితమైన మద్యం సేవించి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఇరవై."

"మరో రెండు కలుపుకో!" ఆ రోజు పని ముగించుకొని ఇంటి ముఖం పడుతున్న లారీ డ్రైవరు జోకేశాడు.

"ఆ దేవుడి పిలుపు ఎప్పుడు, ఎవరికి వస్తుందో? అలా మిడిసిపడకూడదు బాబూ" చెత్త ఎత్తిపోసే చెంచయ్య వాడిని మందలించాడు.